కొండలు మండుతున్నాయ్..!

- వరుస కట్టి కొండలపై మంటలు
- అగ్నికి బుగ్గి అవుతున్న వృక్ష సంపద



మంటల్లో బుగ్గి అవుతున్న ముక్కుకొండ

నగరి: 'అడవికి నిప్పు..మానవాళికి ముప్పు' ఓ వైపు జిల్లాలో అటవీశాఖ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా, మరోవైపు నియోజకవర్గంలోని కొండలు మాత్రం అగ్నికి ఆహుతవుతున్నాయి. రేయింవళ్లనే తేడా లేకుండా కొండలపై మంటలు చెలరేగుతూనే ఉన్నాయి. సోమవారం గుండ్రాజుకుప్పం గుట్ట ప్రాంతంలోని కొండపై మంటలు చెలరేగితే అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్లి శతవిధాలా యత్నించి మంటలను ఆర్పారు. మంగళవారం రాత్రి పుత్తూరు ఆర్డీఎం థియేటర్ సమీపంలోని కొండపై మంటలు రేగి అగ్ని కీలలు కొండంతా విస్తరించాయి. బుధవారం రాత్రి ముక్కుకొండపై మంటలు చెలరేగాయి. కొండపై ఉన్న అడవి అంతా నిప్పు వేగంగా పాకింది. ఇలా వరుసకట్టి రోజూ ఏదో ఒక కొండ నిప్పు ధాటికి వృక్ష సంపద బుగ్గి అవుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు కొండ సమీపం నివాసమున్న ఆందోళన చెందుతున్నారు. ఆకతాయిలే ఇలా చేసి ఉండవచ్చని లేదా ఎండకు వేడెక్కి గాజు పెంకులు రాత్రి విస్ఫోటనం జరపడం వల్ల కూడా మంట పుట్టవచ్చని అగ్నిమాపక అధికారులు పేర్కొంటున్నారు. మొత్తానికి వృక్ష సంపదతోపాటు వన్యప్రాణులకు తీవ్ర నష్టం వాటిల్లుతోందనేది సుస్పష్టం. దీనిపై అటవీ అధికారులు దృష్టి సారించి, అడవుల సంరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





పుత్తూరు ఆర్డీఎం థియేటర్ సమీపం కొండపై మంటలు(ఫైల్), గుండ్రాజుకుప్పం గుట్ట ప్రాంతంలో మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

క్లుప్తంగా

ప్రజలకు అండగా నిలవండి



వైఎస్ జగన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కృపాలక్ష్మి దంపతులు

కార్వేటినగరం: ప్రజల్లో ఉంటూ వారి తరపున ప్రభుత్వంపై పోరాటం చేయాలని, పార్టీ కార్యకర్తలకు అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కృపాలక్ష్మి, అనిల్ దంపతులు బుధవారం తాడేపల్లిలో జగన్‌మోహన్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రజలతో మమేకమై కూటమి ప్రభుత్వం కారణంగా జనం ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలని పార్టీ అధినేత సూచించినట్లు ఆమె బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ప్రజలకు భరోసా కల్పించి, అధైర్య పడకుండా వారిలో ఉత్తేజాన్ని నింపాలని ఆదేశించినట్లు చెప్పారు.

బెల్ట్ షాపుపై దాడి మద్యం బాటిళ్లు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ

నగరి: బైపాస్ రోడ్డులో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుపై డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ బుధవారం ఆకస్మిక దాడి చేశారు. షాపులో ఉన్న 452 హాఫ్ బాటిళ్లను, 42 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. స్వాధీనం చేసుకున్న బాటిళ్ల విలువ రూ.72,793 అని డీఎస్పీ తెలిపారు. దాడిలో సీఐ మహేశ్వర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

రీ సర్వేపై సమీక్ష

పాలసముద్రం: మండలంలోని కృష్ణజమ్మపురంలో రీసర్వేపై గురువారం రైతులతో సమీక్ష నిర్వహిస్తామని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు.

పారిశుద్ధ్యంపై అవగాహన

మండలంలోని శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం, నరసింహపురంలో గురువారం పారిశుద్ధ్య కార్మికులతో కలసి చెత్త నుంచి సంపద తయారీపై ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తామని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి తెలిపారు.

104 సేవలు

మండలంలోని కృష్ణజమ్మపురం పంచాయతీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో 104 వైద్యసేవలు నిర్వహిస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గంగాధర నెల్లూరు: అధిక ఒత్తిడి లేని చదువును అభ్యసించి మానసిక ఉల్లాసంతో పాటు కంటి చూపును కాపాడుకోవాలని సీహెచ్‌ఓ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని ఎట్టేరి గ్రామంలోని భానోదయ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 54 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లావణ్య, ప్రిన్సిపల్ నాగేశ్వరరావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేలాడుతున్న 'మృత్యుతీగలు'

- ఆందోళన చెందుతున్న స్థానికులు



రోడ్డు కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలు

నింద్ర: మండలంలోని ఎలకాటూరు– తిప్పాపురం రోడ్డు మార్గంతో విద్యుత్ తీగలు తీగలు ప్రమాదాలకు తావిచ్చేలా కిందకు వేలాడుతున్నాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళితే విద్యుత్ తీగలు తగులుతున్నాయని సంబంధిత అధికారులకు నివేదించినా పట్టించుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇకనైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి వీటిని ఎత్తులో ఉంచేలా సరిచేయాలని కోరుతున్నారు.

నివాళి



నగరి: నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

నగరి/వడమాలపేట(విజయపురం): నగరి మున్సిపల్ పరిధి సత్రవాడ దళితవాడకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జయశీలన్, వడమాలపేట మండలం తిరుమణ్యం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మదన్‌మోహన్‌రెడ్డి చిన్నాన్న వాసుదేవరెడ్డి బుధవారం మృతి చెందారు. ఆయా గ్రామాలకు వెళ్లి వారి మృతదేహాలకు వైఎస్సార్ సీపీ నాయకుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నగరి మున్సిపల్ వైస్ చైర్మన్ బాలన్, వడమాలపేట మండల కన్వీనర్ సుబ్రమణ్యం రెడ్డి, సర్పంచ్ కుసుమ రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నియామకం



విజేష్

నింద్ర: సమాచార హక్కు చట్టం సాధన కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మండలంలోని కావునూరుకు చెందిన విజేష్‌ను ఆ కమిటీ జాతీయ అధ్యక్షుడు చంటి ముదిరాజ్ నియమించారు. విజేష్ మాట్లాడుతూ, ప్రజలకు సమాచార హక్కు చట్టం, దాని వలన కలిగే ప్రయోజనాలను తెలియజేస్తానన్నారు.

'భస్మ బుధవారం' ప్రార్థనలు



ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్ సురేష్

గంగాధర నెల్లూరు: మండలంలోని సీఎస్‌ఐ వేలూరు డయాసిస్ చర్చ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం వేల్కూరు సమీపంలో ఉన్న మోరియా కొండ వద్ద భస్మ బుధవారం పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ సురేష్ 40 రోజులుగా ఆచరించే ఉపవాస దీక్షల్లో భాగంగా క్రైస్తవుల కఠిన ఉపవాస దినాల ప్రారంభ రోజును భస్మ బుధవారం అని తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని కార్యదర్శి, 13 గ్రామాల ఉపదేశకులు, సంఘ పెద్దలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు రాయితీ



వినియోగదారుల సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ

పుత్తూరు: గృహ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణలో 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తిరుపతి ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు అన్నారు. బుధవారం పుత్తూరు డివిజినల్ పరిధిలో వినియోగదారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఒక కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు మునుపు రూ.2000 ఉండేవని, అందులో 50 శాతం రాయితీ ఇస్తూ, రూ.1000 తగ్గించామని, ఈ అవకాశం జూన్ నెలాఖరు వరకు ఉంటుందన్నారు. వినియోగదారులు వెబ్‌సైట్ లేదా విద్యుత్ ఉపకేంద్రంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల వారు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జాబ్‌మేళాలో 78 మంది ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

నగరి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, అమెజాన్ వేర్ హౌస్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో వేర్ హౌస్ అసోసియేట్ ఉద్యోగాల భర్తీ నిమిత్తం బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు 96 మంది హాజరయ్యారనికళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వేణుగోపాల్ తెలిపారు. ప్రతిభ ఆధారంగా 78 మందిని ఎంపిక చేశారు. కళాశాల జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ పంకజ, కెరీర్ గైడెన్స్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రేవతి, జేకేసీ మెంటార్ లాల్ బాషా, కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు.

23న 'హలో మాల చలో'

వెదురుకుప్పం: రాష్ట్రంలో 90 లక్షలకు పైగా ఉన్న మాలల సమస్యలపై ఈనెల 23న హలో మాల చలో తిరుపతి కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు జేఏసీ అధ్యక్షుడు యనమల సుదర్శనం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మాలల ఉనికిని అనేక కుట్రలతో తగ్గించే పరిస్థితులు రాష్ట్రంలో కొనసాగుతున్నట్లు తెలిపారు. మాలల భవిష్యత్‌లో ప్రమాదకరంగా మారుతున్నట్లు చెప్పారు. ఎస్సీలను విడదీస్తూ అనేక రకాలుగా అణచివేత ధోరణిని అవలంభిస్తున్నారని చెప్పారు. మాలలు అందరినీ ఏకతాటిపై తీసుకొచ్చి మాలలకు జరుగుతున్న అన్యాయాన్ని, కోల్పోతున్న అవకాశాలతో పాటు అనేక అంశాలకు సంబంధించి సంఘటితం చేసి పోరాటాల కోసం సిద్ధం చేయాల్సిన పరిస్థితులు ఆసన్నమైనట్లు చెప్పారు. దీని కోసం ఈనెల 23న ఆదివారం సాయంత్రం 3 గంటలకు తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో పెద్దఎత్తున బహిరంగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాలలంతా పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రైతులకు గుర్తింపు సంఖ్య తప్పనిసరి



రైతుల వివరాలు నమోదు చేస్తున్న రైతు సేవాకేంద్రం సిబ్బంది

పాలసముద్రం: ఫార్మర్ రిజిస్ట్రీతో ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య తప్పక ఉండాలని మండల వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్, సర్పంచ్ గాలి మహేష్ బాబు తెలిపారు. బుధవారం శ్రీకావేరి రాజుపురం రైతు సేవాకేంద్రంలో వ్యవసాయ సహాయకులు వనజ రైతులకు రైతుల విశిష్ట గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమం చేపట్టారు. ఏఓ మాట్లాడుతూ ఆధార్ కార్డు తరహాలోనే రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్యతో కార్డులు జారీ చేయాలని కేంద్రప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాలు రైతులకు అందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

భూసమస్యలు పరిష్కరించండి



భూసమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం: రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి భూ సమస్యలపై వచ్చిన వినతులకు త్వరితగతిన పరిష్కారం చేయాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. బుధవారం ఆముదాల గ్రామ సచివాలయంలో రెవెన్యూ సిబ్బందితో ఆమె మాట్లాడుతూ ఆముదాల పంచాయతీల్లో రైతుల నుంచి వచ్చిన భూసమస్య అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చేయాలని సూచించారు. 22 మంది రైతుల సమస్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని ఆమె గుర్తించారు. వెంటనే పెండింగ్ ఉన్న అర్జీలను తీసుకుని ఆమె స్వయంగా రైతు భూమి వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యలు పరిష్కారం చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ గణేష్, ఆర్ఐ దేవి, వీఆర్ఓ శ్రీనివాసులు, విలేజ్ సర్వేయర్ పాల్గొన్నారు.

ఆర్ఎంపీ క్లినిక్ తనిఖీ



మూసి వేయించిన ఆర్ఎంపీ క్లినిక్

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం ఎస్‌బీఆర్ పురం మెయిన్ రోడ్డుపై నిర్వహిస్తున్న ఆర్ఎంపీ క్లినిక్‌ను వడమాలపేట వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ తన సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. 'వచ్చీరానివైద్యం..ప్రాణంతో చెలగాటం' శీర్షికతో మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనంపై ఆయన స్పందించారు. వైద్యాధికారి, సీహెచ్‌ఓ పురుషోత్తం, సూపర్‌వైజర్ ప్రథమ చికిత్స కేంద్రాన్ని మూత వేశారు.

టీసీ అగ్రహారంలో పడకేసిన పారిశుద్ధ్యం



ఆక్రమణకు గురైన కాలువ



ఊరు మధ్యలో నిలిచి ఉన్న మురుగు నీరు

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం టీసీ అగ్రహారంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఊరు మధ్యలో మురుగు నీరు నెలలు తరబడి నిలిచిపోవడంతో పాచిపట్టి దుర్గంధం చిమ్ముతోంది. మరోవైపు ఇవి దోమల ఉత్పత్తికి నిలయమయ్యాయి. రాత్రి పూట దోమల స్వైర విహారంతో కంటికి కునుకు కరువైందని స్థానికులు వాపోతున్నారు.

కాలువ పూడ్చేయడంతో సమస్యలు

టీసీ అగ్రహారంలో కొందరు కాలువను ఆక్రమించి పూడ్చేశారు. దీంతో మురుగునీరు నిలిచిపోయి సమస్యలు తలెత్తాయి. దీనికి తోడు ఊరు మధ్యలోనే పేడ దిబ్బలు, ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. సచివాలయంలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఉలుకూ పలుకూ లేదని, అలాగే రెవెన్యూ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపానపోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. అక్రమణకు గురైన కాలువలో ఇకనైనా పూడిక తీసి, పారిశుద్ధ్యం సమస్యల్లేకుండా చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారికి పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి

పాలసముద్రం: మండలంలోని జాబ్‌కార్డు ఉన్న ఉన్న ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ కృష్ణమహేష్ రెడ్డి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ సమీక్షించారు. కూలీలకు వేతనాలు రూ.290 తగ్గకుండా మార్కింగ్ ఇచ్చిన తరువాతనే పనులు చేయించాలన్నారు. కూలీల మస్టర్ నమోదు కూడా సక్రమంగా నిర్వహించాలన్నారు. రానున్న రోజుల్లో కూలీల సంఖ్య పెంచాల్సిన బాధ్యత ఫీల్డ్‌అసిస్టెంట్లపై ఉందని, ముఖ్యంగా పనులు నాణ్యత చేయించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ మార్గరెట్, జేఈ రామ్మూర్తి, ఫీల్డ్‌అసిస్టెంట్ మునస్వామి, లక్ష్మణ్, ప్రభు, చంద్రు పాల్గొన్నారు.

స్మగ్లింగ్ కేసులో ఐదుగురి అరెస్ట్

చిత్తూరు అర్బన్: రేషన్ బియ్యం స్మగ్లింగ్ కేసులో ఐదుగురిని టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. స్థానిక కైలాసపురం వద్ద ఓ గోదాములో 5టన్నుల వరకు రేషన్ బియ్యాన్ని దాచి స్మగ్లింగ్ చేస్తుండటంపై మంగళవారం పోలీసులు దాడులు చేయడం విదితమే. ఈ ఘటనలో పెద్ద పంజాణి మండలం రాయల్‌పేటకు చెందిన వెంకటరమణ (28), అమర్‌నాథ్ (25), బైరెడ్డిపల్లెకు చెందిన జగన్నాథం (30), చిత్తూరు ప్రశాంత్ నగర్‌కు చెందిన ముత్తు (24), జానకారపల్లెకు చెందిన మహేష్ (37)ను పోలీసులు అరెస్టు చేశారు.

సారా నిర్మూలనపై అవగాహన సదస్సు



కేవీపురంలో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాస ఆచ్చారి

విజయపురం: సారా తయారీ, రవాణా, అమ్మకం నేరమని ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస ఆచ్చారి అన్నారు. చిత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్, నగరి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ ఆధ్వర్యంలో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం కేవీపురం పంచాయతీలో సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఎవరి ఇంట అయినా సారా స్వాధీనం చేసుకుంటే ఆ కుటుంబ సభ్యులందరినీ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తామని, అంతేకాకుండా సారా విక్రేతలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎక్కడైనా సారా తయారు చేస్తున్న పక్షంలో టోల్ ఫ్రీ నంబర్ 14405, అలాగే 9440902549 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం తెలియజేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం గ్రామంలో ఇకపై సారా తయారీ, రవాణా, విక్రయం చేయబోమని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగరి సీఐ శ్రీనివాసరెడ్డి, విజయపురం ఎస్ఐ బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.